క్లుప్తంగా

పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించండి

పెంట్లవెల్లి: మండలంలోని జటప్రోల్‌లో నెల కొన్న పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించాలని సీపీఎం జిల్లా నాయకుడు ఈశ్వర్ ఆధ్వర్యంలో సోమవారం పంచాయతీ సెక్రెటరీ రజియా సుల్తానాకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు ఈశ్వర్ మాట్లాడుతూ డ్రైయినేజీ అస్తవ్యస్తంగా తయారైందని, రోడ్లపై మురుగు ప్రవహిస్తోందని వివరించారు. దోమలు, ఈగల బెడదతో గ్రామస్తులు రోగాలబారిన పడుతున్నారని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధి కూలీల డబ్బులు తక్షణమే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో హనుమంతు, గోపాల్, ఆంజనేయులు, హిమస్వామి, అరుణ్, బాలకృష్ణలు పాల్గొన్నారు.

పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

కల్వకుర్తిరూరల్: అనుమతి లేకుండా పట్టణంలో పలు పాఠశాలలు సీబీఎస్‌ఈ బోర్డు ఏర్పాటు చేసుకున్నాయని ఆ పాఠశాలల యజమానులపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకుడు సంతోష్ ఆధ్వర్యంలో సోమవారం మండల విద్యాశాఖ అధికారి దాసునాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ పాఠశాలలకు నోటీసులు జారీ చేస్తామని హామీ ఇచ్చినట్లు సంతోష్ విలేకరులకు తెలిపారు. కార్యక్రమంలో పవన్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం

కల్వకుర్తిరూరల్: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని ప్రగతి ఫౌండేషన్ చైర్మన్ ఆరీఫుద్దీన్ అన్నారు. సోమవారం పట్టణంలో ఆయన మొక్కలు నాటారు. సామాజిక బాధ్యతగా అందరు మొక్కలు నాటి సంరక్షించే బాధ్యత అందరిపై ఉందన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి



తెలకపల్లి: విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నతంగా ఎదగాలని ఆలేరు మాజీ ఉప సర్పంచ్ పి కరుణాకర్ అన్నారు. సోమవారం మండలంలోని ఆలేరు ఉన్నత పాఠశాలలో సొంత ఖర్చులతో రూ.10 వేలు విలువగల 175 మంది విద్యార్థులకు టై, బెల్టులను అందజేశారు. పాఠశాల అభివృద్ధికోసం ఎప్పుడు అందుబాటులో ఉంటానని అన్నారు. అనంతరం దాతను సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు నరహరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరుగుపందెంలో విద్యార్థి ప్రతిభ



కొల్లాపూర్: చార్మినార్ చాలెంజ్ ఖేలో పేరిట ఇటీవల హైదరాబాద్ అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఒక కిలోమీటర్ పరుగుపందెంలో పట్టణంలో డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థి ఎం.అరవింద్ ప్రథమ బహుమతి గెలుపొందారు. సోమవారం కళాశాలలో ప్రిన్సిపాల్ రామరాజుయాదవ్‌తో పాటు అధ్యాపకులు అభినందించి, నగదు పురస్కారం అందజేశారు.

పరిహారం చెల్లించాలి



కొల్లాపూర్: ఇటీవల కురిసిన వర్షాలకు పట్టణంలో దెబ్బతిన్న ఇళ్లకు పరిహారం చెల్లించాలని కోరుతూ ఇందిరా కాలనీకి చెందిన అవుట రాజశేఖర్ గ్రామస్తులతో కలిసి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐ గోవింద్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. 11 వ వార్డులోని ఇందిరాకాలనీతో పాటు, పలు ప్రాంతాల్లో పాత మిద్దెలు కూలిపోయాయని, పలు నివాసాలు పైకప్పులు ఊడిపడ్డాయని ఆయన వివరించారు. దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించి, బాధితులకు ప్రభుత్వ పరంగా సహాయం అందించాలని ఆయన కోరారు.

బడ్జెట్‌లో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: రాష్ట్రంలో ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో జనాభా ప్రాతిపదికన బీసీలకు బడ్జెట్ కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు సోమవారం జిల్లా కేంద్రానికి వచ్చిన పీసీసీ నేత, మాజీ ఎంపీ మధుయాస్కీగౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. బీసీ కులగణన చేపట్టాలన్నారు. స్థానిక సంస్థలలో బీసీలకు రిజర్వేషన్ పెంచాలన్నారు. వృత్తిపరంగా రుణాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కుంభం మల్లేష్‌గౌడ్, సదుర్ల తిరుపతయ్య, కాళ్ల నిరంజన్, అరవిందాచారి తదితరులు పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే..

తెలకపల్లి: వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లు అధ్వనంగా తయారయ్యాయి. మండల కేంద్రంలోని పలు కాలనీలలో రోడ్లు బురదమయంగా దర్శనమిస్తున్నాయి. మండల కేంద్రంలోని నెహ్రూ చౌరస్తా, బస్టాండ్ ప్రాంతంలో రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. వీధుల్లో అడుగు తీసి అడుగువేయలేని దుస్థితి నెలకొందని కాలనీవాసులు వాపోతున్నారు.

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని సుభాష్‌నగర్‌లో సోమవారం రోడ్డుపై వరినాట్లు నాటి బీజేపీ నాయకులు నిరసన తెలిపారు. అనంతరం బీజేపీ నాయకుడు గుర్రాల రాంభూపాల్‌రెడ్డి రోడ్లు గుంతలమయంగా మారినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీసీ రోడ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, సురేష్, దుర్గాప్రసాద్, శేఖర్‌రెడ్డి, రాఘవేందర్‌గౌడ్, రవిగౌడ్, శీనుముదిరాజు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వెల్దండ: మండలంలోని రాచూర్, కంటోనిపల్లి, తిమ్మినోనిపల్లి గ్రామాల్లో రోడ్లు చిత్తడిగా మారాయి. మూడు రోజులుగా కురుస్తున్న ముసురు వర్షాలకు రోడ్లపై నీరు నిల్వ ఉండటంతో ఇబ్బందులు పడుతున్నారు. గుంతలమైన రోడ్లతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 15 ఏళ్లుగా ఆయా గ్రామాలకు బీటీరోడ్లకు నోచుకోవడం లేదని వాహనదారులు వాపోతున్నారు. దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మతు చేపట్టాలని కోరుతున్నారు.

కోడేరు: మండలంలోని నాగులపల్లి, కోడేరు, ఖానాపూర్ వెళ్లే రోడ్లు రోడ్లు దెబ్బతిన్నాయి. ఆర్ అండ్‌బీ అధికారులు వెంటనే స్పందించి బురదమయాంగా మారినా రోడ్లకు తాత్కాలిక మరమ్మతు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.



రోడ్డుపై వరినాట్లు వేస్తున్న బీజేపీ నాయకులు



తెలకపల్లి నెహ్రూ చౌరస్తాలో నిలిచిన నీరు



కోడేరు మండలం నాగులపల్లిలో



వెల్దండ - రాచూర్ గ్రామాల మధ్య గుంతలమయంగా ఉన్న రోడ్డు

మంత్రి జూపల్లి చిత్రపటానికి పాలాభిషేకం

పెంట్లవెల్లి: మండలంలోని కొండూరు గ్రామ పాఠశాలలో సోమవారం మంత్రి జూపల్లి చిత్రపటానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు, నాయకులు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్ నల్లపోతుల గోపాల్, రత్నగిరి ఫౌండేషన్ కన్వీనర్ ధర్మతేజ మాట్లాడుతూ రత్నగిరి ఫౌండేషన్ పాఠశాల అభివృద్ధికి రూ.40 లక్షలు కేటాయించడం సంతోషకరమన్నారు. మంత్రికి రుణపడి ఉంటామన్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నాగరాజు, భాస్కర్, గ్రామస్తులు నల్లపోతుల గోపాల్, రత్నగిరి ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి ధర్మతేజ, విజయగౌడ్, కురుమయ్య, సత్తిరెడ్డి, రవిలు పాల్గొన్నారు.



మంత్రి జూపల్లి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న విద్యార్థులు

ప్రజా సమస్యలను పరిష్కరించాలి



ప్రజా అధ్యయన యాత్రలో పాల్గొన్న నరసింహ

కోడేరు: ప్రజా సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి నరసింహ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని జనుంపల్లిలో ప్రజా అధ్యయన యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలు రోజురోజుకు పేరుకుపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైయినేజీ, వీధి దీపాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రేషన్‌కార్డులు, పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. శివ శంకర్, వరప్రసాద్, రామస్వామి, నాగరాజు, మహేందర్, శ్రీను, ధర్మేందర్, శివ తదితరులు పాల్గొన్నారు.

బల్మూర్: మండల కేంద్రంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి చందునాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి శంకర్ మాట్లాడారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు గ్రామంలో రోడ్లు బురదమయంగా మారాయని, గుంతలలో మురుగు చేరి గ్రామస్తులు తాగునీరు కలుషితమవుతోందని వివించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు లాల్‌అహ్మద్ మధు, మాసయ్య, వెంకటయ్య, ఆంజనేయులు, భారిమామ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య

కొల్లాపూర్: ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య అందుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ మేకల రమ్య అన్నారు. సోమవారం పట్టణంలోని కేజీబీవీ పాఠశాలను ఆమె సందర్శించారు. పాఠశాల నిర్వహణకు సంబంధించిన అంశాలపై ప్రిన్సిపాల్‌తో చర్చించారు. విద్యార్థినులకు వడ్డించే భోజనాన్ని పరిశీలించారు. మెనూ అమలు గూర్చి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణలో పిచ్చిమొక్కలు తొలగించాలని విద్యార్థినులు విన్నవించారు. త్వరలో పాఠశాల పరిసరాలు శుభ్రం చేయిస్తామని భరోసా ఇచ్చారు. చైర్‌పర్సన్ వెంట కౌన్సిలర్లు రహీంపాషా, నయీమ్ తదితరులు ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

కొల్లాపూర్: పట్టణంలోని ఈదమ్మ గుడి వద్ద మున్సిపల్ అధికారులు నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను చైర్ పర్సన్ మేకల రమ్య సోమవారం ప్రారంభించారు. గుడి వద్ద తాగునీటి సరఫరా, జాతర సమయంలో విద్యుత్ సరాఫరాలో ఇబ్బందులు లేకుండా మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశానుసారం ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశామని వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, కౌన్సిలర్లు బాలస్వామి, నయూమ్, రహీంపాషా, మున్సిపల్ ఉద్యోగులు ఉన్నారు.



భోజనాన్ని పరిశీలిస్తున్న చైర్‌పర్సన్

గ్రంథాలయానికి కపిలవాయి పేరు పెట్టాలి

నాగర్‌కర్నూల్: జిల్లా కేంద్రంలో కొత్తగా నిర్మిస్తున్న గ్రంథాలయ భవనానికి సాహితీవేత్త, కవి, దివంగత డా.కపిలవాయి లింగమూర్తి పేరు పెట్టాలని సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సంతోష్‌కు సామాజిక ఉద్యమకారులు వి.రాజశేఖర్ శర్మ, దుగ్యాని వెంకటయ్య విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి జిల్లాల్లో మరుగున పడిన గ్రామాల, దేవాలయాల చరిత్రను కపిలవాయి వెలికితీశారని వివరించారు. ఏడు దశాబ్దాల సాహితీ సేవలకు గుర్తింపుగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 2014లో గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసిందని పేర్కొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులు సత్వరమే పరిష్కారం

చారకొండ: ప్రజావాణి ఫిర్యాదులు సత్వరమే పరిష్కారం చేస్తామని డిప్యూటీ తహసీల్దార్ విద్యాధరి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో డీటీ విద్యాధరి జూపల్లి, తిమ్మాయిపల్లి గ్రామాల సంబంధిత రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. రెండు ఫిర్యాదులు అందినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్, ఏఓ చిన్న హుస్సేన్, ఎంపీఓ వెంకటేష్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



పానగల్: సీజనల్‌గా వచ్చే వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య అన్నారు. సోమవారం మండలంలోని గోప్లాపూర్‌లో వైద్య సిబ్బందితో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం సీజన్ కావడంతో ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నీటి నిల్వలు లేకుండా చూసుకోవడం, నిల్వ నీటిని వారానికి ఒక్కసారి పారబోస్తూ నూతన నీటిని పట్టుకోవాలన్నారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే దోమలు వృద్ధి చెంది రోగాలు సంభవిస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. సీజనల్ వ్యాధులతో పాటు విష జ్వరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించి పలు సూచనలు చేశారు. అనారోగ్యానికి గురైతే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాంచందర్, సతీష్, మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

యూనిఫాం అందజేత



అచ్చంపేట రూరల్: పట్టణంలోని సరస్వతీ శిశు మందిర్ పాఠశాలకు అనుబంధంగా నడుస్తున్న గిరిజన బాలుర హాస్టల్ 50 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి 2 జతల చొప్పున సోమవారం అచ్చంపేటకు చెందిన ఎ. రాజు యూనిఫాం అందజేశారు. అలాగే భవిష్యత్‌లో వివిధ రూపాల్లో ఆర్థికసాయం చేయనున్నట్లు తెలిపారు. దాతను పలువురు అభినందించారు. కార్యక్రమంలో సుధాకరయ్య, డాక్టర్ బాల్ నారాయణ, రాజు, వెంకటేష్, భాస్కర్, సాధిక్, క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థికసాయం అందజేత

వెల్దండ: మండలంలోని రాఘయపల్లి గ్రామానికి చెందిన రాయకంటి గిరి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. సోమవారం రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి బాధితుడిని పరామర్శించారు. అనంతరం బాధితుడికి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పుట్టరాంరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ వెంకటయ్యగౌడు, నాయకులు మధుసూధన్‌రెడ్డి, కొండల్‌యాదవ్, శ్రీను, గణేష్, నర్సింహా, యాదయ్య, శ్రీహరి, యాదగిరి తదితరులు ఉన్నారు.

బారులుతీరిన రైతులు



పెద్దకొత్తపల్లి: మొదటి విడతగా రూ.లక్ష వరకు రుణమాఫీ డబ్బులు రైతుల ఖాతాలలో ప్రభుత్వం జమ చేసింది. ఈ మేరకు డబ్బులు విత్ డ్రా కోసం రైతులు సోమవారం బ్యాంకుల వద్ద బారులు తీరారు. మండల కేంద్రంలోని ఏపీజీవీబీ బ్యాంకుకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మండలంలోని రైతులకు మొదటి విడతగా 3,987 మంది రైతులకు రూ.లక్ష వరకు రుణమాఫీ అయ్యిందని బ్యాంక్ మేనేజర్ ప్రసాద్ తెలిపారు. చంద్రకల్ 393, గంట్రావ్‌పల్లి 290, కల్వకోల్ 536, ముష్టిపల్లి 481, పెద్దకొత్తపల్లి 480, పెద్దకార్పాముల 411, సాతాపూర్ 423, వెనచర్ల 477, యాపట్ల 496 మంది రైతులకు రుణమాఫీ అయినట్లు పేర్కొన్నారు.

దివ్యాంగుల నిరసన

కల్వకుర్తిరూరల్: మండలంలోని రఘుపతిపేటలో సోమవారం దివ్యాంగుల సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి బాలీశ్వర్ మాట్లాడుతూ ఐఏఎస్ అధికారి స్మితాసబర్వాల్ సామాజిక మాధ్యమంలో దివ్యాంగుల రిజర్వేషన్లను కించపర్చడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాండు, అశోక్, పరుశరాములు, శ్రీను, పవన్ తదితరులు పాల్గొన్నారు.

క్షమాపణ చెప్పాలి..

మన్ననూర్: సివిల్ సర్వీస్‌లో వికలాంగుల కోటాపై అనుచిత వ్యాఖ్యలు చేసిన చేసి వికలాంగులను అవమాన పర్చిన ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్ వితక్షణమే క్షమాపణ చెప్పాలని వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దేశంలో అత్యున్నతమైన సివిల్ సర్వీసెస్ ఉద్యోగాలకు వికలాంగుల అనర్హులని మాట్లాడటం తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని కోరారు.

కొనసాగుతున్న కంటి వైద్య శిబిరం

వెల్దండ: మండల కేంద్రంలోని ఏవీఆర్ గార్డెన్‌లో నిర్వహిస్తున్న కంటి వైద్య శిబిరం సోమవారం కొనసాగింది. ఈ సందర్భంగా యెన్నమ్స్ ఆస్పత్రి చైర్మన్ హరికాంత్‌రెడ్డి, ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు కృష్ణారెడ్డిలు శిబిరాన్ని సందర్శించారు. ఈ నెల 27 వరకు శిబిరం కొనసాగుతోందని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అవసరమైన వారికి కంటిఅద్దాలను పంపిణీ చేశారు. శ్రీరాములు, నరేందర్‌గౌడ్, మహేష్, రాహుల్ తదితరులు ఉన్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

అమ్రాబాద్: మండల కేంద్రంలో రోడ్లు, పారిశుద్ధ్యం సమస్యలపై 'అధ్వానంగా అంతర్గత రోడ్లు' శీర్షికతో సాక్షి దినపత్రికలో సోమవారం వార్త ప్రచురితం అయ్యింది. ఈ మేరకు అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతు పనులు చేపట్టారు. మైనార్టీకాలనీ, మార్కెట్‌యార్డు కాలనీలో పిచ్చి, కంపచెట్లను తొలగించారు. మురుగు కాల్వలను శుభ్రం చేయించారు. గ్రంథాలయం కాలనీ, మద్దిమడుగురోడ్డు వెంట పారుతున్న మురుగును డ్రైయినేజీకి మళ్లిస్తామని పంచాయతీ కార్యదర్శి మల్లేష్ తెలిపారు. మిగిలిన పనులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించే విధంగా కృషి చేస్తామని పేర్కొన్నారు.



పెద్ద మసీదు మైనార్టీ కాలనీలో చెట్లను తొలగిస్తున్న సిబ్బంది

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏఓ శిరీష

చారకొండ: మండలంలోని రైతులు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి చిన్న హుస్సేన్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గత నెల 28 వరకు భూములు రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులు అర్హులని పేర్కొన్నారు. వచ్చే నెల 3వ తేదీ వరకు గడువు ఉందని వివరించారు. అదేవిధంగా నామినీ మార్పుకు ఈ నెల 31వ తేదీ వరకు అవకాశం ఉందని తెలిపారు. దరఖాస్తు ఫారం, పట్టాపుస్తకం, ఆధార్ కార్డు నకలు, నామినీ ఆధార్ జిరాక్స్‌లు ఏఈఓలకు సమర్పించాలని కోరారు.

పెద్దకొత్తపల్లి: గత నెల జూన్ 28 వరకు కొత్తగా పాసుపుస్తకం వచ్చిన రైతులు రైతు బీమా పథకానికి దరఖాస్తులు చేసుకోవాలని ఏఓ శిరీష తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో రైతుల నుంచి రైతుబీమా దరఖాస్తులను స్వీకరించారు.

ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: హమాలీ కార్మికులకు ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మారేడు శివశంకర్ డిమాండ్ చేశారు. సోమవారం ఈఎంఎల్ గోదాం హమాలీల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఉన్న ఐఎంఎల్ గోదాంలలో పనిచేసే కార్మికులకు రెండు జతల షూ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెలలో జరిగే శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐఎంఎల్ గోదాం హమాలీ కార్మికులు వెంకటయ్య, ఆంజనేయులు, కృష్ణ, మధు, బాలయ్య, చిన్నకురుమయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మారేడు శివశంకర్

హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడుదాం



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వెల్దండ: హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడుదామని మత్స్యశాఖ జిల్లా డైరెక్టర్ కసారపు వెంకటయ్యముదిరాజ్, ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు మల్లేష్‌ముదిరాజ్‌లు పేర్కొన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏళ్లుగా పోరాటాలు చేస్తున్న ముదిరాజ్‌లకు న్యాయం చేకూరడం లేదన్నారు. ముదిరాజ్ కులస్తులను బీసీ–డీ నుంచి బీసీ–ఏ లోకి మార్చాలన్నారు. కోర్టుల్లో కేసులు పరిష్కారం అయిన ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను నేరవేర్చాలన్నారు. ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రతి ఏడాది రూ.1000 కోట్ల బడ్జెట్ కేటాయించాలన్నారు. మత్స్య కో–ఆపరేటివ్ సోసైటీ ఏర్పాటు చేయాలన్నారు. 50 ఏళ్లు నిండిన మత్స్యకారులకు ఫించన్ సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో సింగల్‌విండో డైరెక్టర్ శేఖర్‌ముదిరాజ్, నాయకులు కృష్ణముదిరాజ్, బాల్‌రాజుముదిరాజ్, మల్లయ్య, ఎర్రశ్రీను ముదిరాజ్, వెంకటేష్, నర్సింహ్మముదిరాజ్, బాలకృష్ణ, దేవేందర్, శ్రీశైలం, యాదయ్య, లాలయ్య, శ్రీను, మల్లేష్, శివముదిరాజ్, గణేష్, రాజు, నాగరాజు, శ్రీను, తదితరులు ఉన్నారు.



పెంట్లవెల్లిలో..

పెంట్లవెల్లి: ముదిరాజ్‌లను బీసీడీ నుంచి బీసీఏలోకి చేర్చాలని కోరుతూ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు పగిడాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ హిమబిందుకు వినతిపత్రం అందజేశారు. కుంటలు, చెరువులు, నదులలో పూర్తిగా హక్కు మత్స్యకారులకే కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. మత్స్యశాఖ మండల అధ్యక్షుడు డబ్బ గోవింద్, కుమార్, కొత్త శివయ్య, జాగటి నిరంజన్, కురుమయ్య, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

కోడేరు: ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏలోకి మార్చాలని కోరుతూ తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ పగిడల శ్రీనివాసులు, మాజీ వైస్ ఎంపీపీ వెంకటస్వామి, కాకం లక్ష్మయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు వేయాలని గిరిజనుల నిరసన

అచ్చంపేట రూరల్: మండలంలోని లక్ష్మాపూర్ నుంచి చెంచుపలుగుతండాకు బీటీ రోడ్డు వేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం తండావాసులు నిరసన వ్యక్తం చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దేశ్యానాయక్, మండల కార్యదర్శి మల్లేష్ మద్దతు తెలిపి మాట్లాడారు. రోడ్డుతో పాటు ఫారెస్ట్ భూములకు పట్టాలు ఇవ్వాలని, ధరణి సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు. గతంలో ప్రజాప్రతినిధులు హామీలు ఇచ్చినా నెరవేరలేదన్నారు. తండావాసుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వెంటనే సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈనెల 29న అచ్చంపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ జిల్లా నాయకుడు అఖిలేష్, తండావాసులు రవీందర్, రవి, భాస్కర్, మహిళలు పాల్గొన్నారు.



తండాకు వెళ్లే రోడ్డును చూయిస్తున్న గిరిజనులు

బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని ఆందోళన



వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

కల్వకుర్తిరూరల్: ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన బీసీ డిక్లరేషన్ వెంటనే అమలు చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ పిలుపుమేరకు సోమవారం పట్టణంలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబీసీ మోర్చా జిల్లా ఇన్‌చార్జి అశోక్, జిల్లా అధ్యక్షుడు నిరంజన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి పాలకూర రవిగౌడ్‌లు మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లను 22 శాతం నుంచి 42 శాతానికి పెంచుతామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారన్నారు. హామీలను విస్మరిస్తే పెద్ద ఎత్తున ధర్నా చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దుర్గాప్రసాద్, రాఘవేందర్‌గౌడ్, కృష్ణగౌడ్, నర్సింహ, సురేందర్‌గౌడ్, చందుముదిరాజు, బాలరాజుగౌడ్, రాంభూపాల్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

పెద్దకొత్తపల్లి: మద్యం తాగి వాహనాలు నడపొద్దని ఎస్‌ఐ సతీష్ కోరారు. సోమవారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్, కొల్లాపూర్ హైవే రోడ్డు వెంట సంజీవాపూర్ నుంచి కల్వకోల్ వరకు ప్రమాదాల నివారణకు సంబంధించిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వాహనాలు నడిపేవారు కుటుంబ సభ్యులను దృష్టిలో పెట్టుకొని వాహనాలు నడపాలని సూచించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ కల్యాణ్, హోంగార్డ్ అశోక్, సుధాకర్, రాములు పాల్గొన్నారు.



ఫ్లెక్సీలను ఏర్పాటు చేయిస్తున్న ఎస్‌ఐ సతీష్